క్లుప్తంగా

రేపు మాణిక్య ప్రభు జాతర

పెద్దేముల్: ఈ నెల 27న మాణిక్యప్రభు జాతర జరగనుందని ఆలయ ధర్మకర్త కొండూరు మాణిక్యప్రభు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండల కేంద్రం లోని ఆలయంలో రాత్రి భజన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం ఉదయం సుప్రభాత సేవ, 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక పూజలు, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఉంటుందని వెల్లడించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం ఎర్రగోవింద్ తండాలో ఎంపీపీ నిధులు రూ.4 లక్షలతో సీసీరోడ్లు, రూ.2 లక్షలతో హైమాస్ట్ విద్యుత్ దీపాలను అమర్చేందుకు స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు

దోమ: అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్ కుమార్‌కు జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రమేశ్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ పట్టణంలోని ఆయన నివాసంలో స్పీకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. శాసనసభ స్పీకర్‌గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేయడం హర్షించదగిన విషయమన్నారు. గ్రామాల్లో ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీలు నిరుపేదలుగా మిగిలి ఉన్నారని, వారి అభ్యున్నతికి స్పీకర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో?



పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రోడ్డు దుస్థితి

దోమ: గ్రామీణ ప్రాంత రోడ్లు కంకర తేలి, గుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధి పాలేపల్లి నుంచి ఐనాపూర్ మీదుగా మల్లేపల్లి, దాదాపూర్, గుండాల, కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా కంకర తేలింది. కాలి నడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది. రోడ్డు గురించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వాహనదారులు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే బీటీరోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

షాద్‌నగర్: వనపర్తి జిల్లా కేంద్రంలో విజేత షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో షాద్‌నగర్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో సత్తా చాటారని కరాటే మాస్టర్ చెన్నయ్య తెలిపారు. అండర్ 12 కటాస్ విభాగంలో తులసి బంగారు పతకం, మధుప్రియ మెడల్ సాధించారు. అండర్ 14 విభాగంలో వైష్ణవి, భూమిక, సమ్రీన్ బేగం, అంకిత, నికిత బంగారు పతకాలను సాధించారు.



వికారాబాద్: రిటైర్డ్ ఇంజినీర్ జేఎస్ నివాసంలో జరిగిన సంబురాల్లో స్పీకర్, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు



పరిగి: కేక్‌కట్ చేస్తున్న పాస్టర్లు, భక్తులు



కొడంగల్ రూరల్: మెథడిస్టు చర్చిలో మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్

కరుణామయుడి సన్నిధిలో సేదతీరిన భక్తజనం

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని ప్రార్థనాలయాలు, పరిసర ప్రాంతాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, భజన కీర్తనలతో సందడి నెలకొంది. కరుణామయుడి చరిత్రను వర్ణిస్తూ పాస్టర్లు ప్రవచనాలు వినిపించారు. క్రీస్తు జనం, మరణం, ఆయన సందేశాల గురించి సందేశం ఇచ్చారు. వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని కేక్ కట్‌చేశారు. ఏసు బోధనలు అందరికీ ఆచరణీయమని, ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు. కుల మతాలకు అతీతంగా, శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలని సూచించారు.

–సాక్షి, నెట్‌వర్క్



పూడూరు: అంగడిచిట్టంపల్లిలో భక్తి గీతాలు పాడుతున్న భక్తులు



దోమ: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



పరిగి: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



వికారాబాద్ మెథడిస్ట్ చర్చిలో..



అనంతగిరి: వికారాబాద్ మెథడిస్టు చర్చిలో సందేశం వినిపిస్తున్న పాస్టర్



మోమిన్‌పేట: ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మనుస్మృతితోనే వివక్షత

దళిత ప్రజాసంఘాల నాయకులు



అంబేడ్కర్ విగ్రహం ఎదుట మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: కుల మతాల మధ్య ఐక్యతను చెరిపి, వివక్షతను సృష్టించింది మనుస్మృతియేనని దళిత ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. సోమవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల అంబేడ్కర్ విగ్రహాల ఎదుట దళిత, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో మనుస్మృతి దహన దినాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధి కొత్తూరు, నాందార్‌పూర్, తుంకిమెట్ల, బొంరాస్‌పేట, ఏర్పుమళ్ల, దుద్యాల మండల కేంద్రంతో పాటు అల్లిఖాన్‌పల్లి, చిల్మల్‌మైలారం, గౌరారం, హకీంపేట తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల ఎదుట మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. 1927 డిసెంబర్ 25న అంబేడ్కర్ కుల వివక్షత, అంటరానితనం నిర్మూలనకు మనుస్మృతిని కాల్చివేశారని కేవీపీఎస్ మండల అధ్యక్షుడు కొత్తూరు అంజిలప్ప తెలిపారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలను చదువుకు దూరంగా ఉంచింది మనుస్మృతేనని పేర్కొన్నారు. బానిసలుగా నిలబెట్టింది మనుధర్మమేనని, దాని వలనే అన్ని వర్గాల్లో వివక్షత ఏర్పడిందని వివరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి అంజి, సభ్యులు ముకుందం, నర్సింహులు, చిన్న బసయ్య, ప్రజాసంఘాల నాయకులు, విద్యావంతులు, యువజనసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని నర్సింహులు ఇంట్లో సోమవారం అయ్యప్ప స్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆదర్శనీయుడు అటల్ బిహారీ



పూడూరు: వాజ్‌పేయి చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న నాయకులు



దౌల్తాబాద్‌లో నివాళి అర్పిస్తున్న పార్టీ నాయకులు తదితరులు

- దేశ రాజకీయాల్లో ఆయనది చెరగని ముద్ర
- ఘన నివాళి అర్పించిన బీజేపీ నేతలు

పూడూరు: భారత మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత అటల్ బిహారీ వాజ్‌పేయి దేశం కోసం ఎనలేని సేవలు చేశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్ అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడారు. దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడు వాజ్‌పేయి అని కొనియాడారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, కలశాలను మండల పరిధి రాకంచర్ల ఆలయ ప్రాంగాణంలో గ్రామాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాఘవేందర్, రవీందర్, నాయకులు శ్రీకాంత్, పాండు, సాయిలు, రాంచంద్రి, శ్రీశైలం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు

తాండూరు టౌన్: మాజీ ప్రధాని వాజ్‌పాయ్ ఆదర్శనీయుడని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. ప్రధానిగా ఆయన చేపట్టిన సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. సౌమ్యుడు, నిజాయితీ, ఉత్తమ పార్లమెంటేరియన్ అయిన వాజ్‌పేయి.. నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో పార్టీ శ్రేణులు నడవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భద్రేశ్వర్, బాలప్ప, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు



కుల్కచర్లలో..

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: వాజ్‌పేయి జయంతిని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ మాట్లాడారు. ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి సమర్థవంతమైన పాలన అందించారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, శాంతి, శ్రీశైలం, వెంకటప్ప, వెంకట్‌నాయక్ తదితరులున్నారు.

జనం మెచ్చిన నేత..

కుల్కచర్ల: జనం మెచ్చిన నేత అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, ప్రధాన కార్యదర్శి హన్మంతు, నర్సింహ రెడ్డి, సురేందర్, వెంకట్రాములు, కొండ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు ఏర్పాట్లు

- ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ నుంచి గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.విజయకుమార్ తెలిపారు. 28న పోచమ్మతండా, ఖాజాఅహ్మద్‌పల్లి, ప్యాలమద్ది, హుస్సేన్‌పూర్, 29న అప్పాయిపల్లి, ఉడిమేశ్వరం, పర్సాపూర్, పలుగురాళ్లతండా, 30న పెద్దనందిగామ, చిన్ననందిగామ, హస్నాబాద్, ఆలేడ్, జనవరి 2న టేకుల్‌కోడ్, అన్నారం, రావులపల్లి, లక్ష్మిపల్లి, 3న రుద్రారం, పాటిమీదిపల్లి, అంగడిరాయిచూర్, సంఘాయిపల్లి, 4న చిట్లపల్లి, నాగారం, ఇందనూర్, కస్తూర్‌పల్లి, 5న భవనమ్మతండా, బోయపల్లితండా గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయ ఆవరణ, రైతువేదికల్లో చేపట్టే ప్రజాపాలనలో తహసీల్దార్ విజయకుమార్, మండల అభివృద్ధి అధికారి డి.పాండు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో..

మున్సిపాలిటీలో 28న ఒకటో వార్డుకు చితారు పెరుమాళ్ల ఆలయ సమీపంలో, 2వ వార్డుకు బీసీ కమ్యూనిటీ హాల్, 29న 3వ వార్డుకు పాతకొడంగల్‌లోని అంగన్‌వాడీ సెంటర్, 30న 4వ వార్డు గుండ్లకుంట గ్రామంలో, 5వ వార్డుకు కొండారెడ్డిపల్లిలో, 2న 6వ వార్డులోని వినాయక కట్ట లాహోటి కాలనీలో, 3న 7వ వార్డుకు బూల్కాపూర్‌లోని అంజనేయ దేవాలయ సమీపంలో, ఐనన్‌పల్లిలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో, 4న 8వ వార్డుకు చితారుపెరుమాళ్ల దేవాలయ సమీపంలో, 9వ వార్డుకు అంగన్‌వాడీ సెంటర్‌లో, 5న 10వ వార్డుకు చౌడేశ్వరీ దేవాలయ సమీంలో, 11వ వార్డుకు నగరేశ్వర దేవాలయ సమీపంలో, 6న 12వ వార్డుకు గాంధీనగర్‌లోని ధర్మశాల సమీపంలో ప్రజాపాలనకు సంబంధించిన అర్జీలను మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ఏఈ రాకేష్‌రెడ్డిలు స్వీకరించనున్నారని తెలిపారు.



పట్టణంలోని శ్రీమణికంఠ ఆశ్రమంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజలో స్వామికి హారతి పడుతున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తదితరులు - తాండూరు టౌన్

ఆగుతూ 'సాగు'తూ

- ఎకరంలోపు అందిన సాయం
- ఎదురుచూస్తున్న మిగతా రైతులు
- పెట్టుబడికి తప్పని తిప్పలు
- అప్పులు చేస్తున్న అన్నదాతలు

షాబాద్: యాసంగిలో పంటలు సాగు చేయడానికి రైతుబంధు పెట్టుబడి కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు సాయం అందిస్తున్నా.. ఆ ప్రక్రియ నినాదంగా సాగుతోంది. షాబాద్ మండలంలో ఇప్పటివరకు 6 వేల 214 మంది రైతులకు, రూ.1కోటి 35లక్షలు ఖాతాల్లో జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి వెంకటేశం తెలిపారు. అరెకరం, ఎకరం లోపు భూమి ఉన్న రైతులకు ఖాతాల్లో మాత్రమే రైతుబంధు డబ్బులను జమ చేసున్నట్లు గణాంకాలు చెపుతున్నాయి. యాసంగి సీజన్ ఆరంభమై నెలరోజులు గడుస్తున్నా.. సాయం అందకపోవడంతో పెట్టుబడుల కోసం రుణదాతలను ఆశ్రయిస్తున్నారు.

పాత పద్ధతిలోనే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసినట్లుగానే ఈ సీజన్‌లో ఎకరానికి రూ.5వేల



చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాత పద్ధతిలోనే డబ్బులు జమచేసే ప్రక్రియను ఈ నెల 12 నుంచి ప్రారంభించింది. రంగారెడ్డి ట్రెజరీ నుంచి దశలవారీగా డబ్బులను జమ చేస్తామని పేర్కొంది. తొలుత ఎకరం లోపు వారికి, ఆ తర్వాత దశలవారీగా రోజుకు ఎకరం చొప్పున పెంచుతూ రెండు ఎకరాలు, మూడెకరాలు, అంతకుమించి భూమి ఉన్న రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

పెట్టుబడికి తిప్పలు

సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటింది. రుణమాఫీ రద్దు కాకపోవడంతో బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపించడం లేదు. దీంతో రైతులు పంట రుణాలు అందక, రైతుబంధు జమ కాకపోవడంతో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే రైతుబంధును వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

కర్షకుల్లో ఆందోళన

వానాకాలం సీజన్‌లో కూడా చాలా మందికి రైతుబంధు డబ్బులు జమకాలేదు. సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ ఆ సీజన్ ముగిసే నాటికి కూడా డబ్బులు రాకపోవడంతో కర్షకులు నానా ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగినా వారికి సరైన సమాధానం రాలేదు. ప్రస్తుత యాసంగి సీజన్ కూడా డబ్బుల జమ ప్రక్రియ నత్తనడకన సాగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతి రైతుకూ రైతుబంధు



రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్ రైతుబంధు డబ్బులు జమ చేయడాన్ని ప్రారంభించింది. ముందుగా అర ఎకరా, ఎకరం లోపు రైతులకు ఆ తరువాత రెండెకరాలోపు వారికి ఇలా దశలవారీగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సాయం తప్పకుండా అందుతుంది.

–వెంకటేశం, మండల వ్యవసాయాధికారి, షాబాద్

ఆనవాళ్లు కోల్పోయిన రోడ్డు

- గుంతలమయం, అసంపూర్తి రోడ్డుతో వాహనదారుల ఇక్కట్లు
- పుష్కరకాలం గడిచినా ముందుకు సాగని నిర్మాణ పనులు



ధారూరు ఈద్గా సమీపంలో బీటిరోడ్డు దుస్థితి

ధారూరు: ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన రోడ్డు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులకు నోచుకోలేదు. తద్వారా అది ఆనవాళ్లు కోల్పోయి, మట్టి రోడ్డులా మారింది. ఈ రహదారి నిర్మాణం కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.42 కోట్లు కేటాయించింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్.. రోడ్డు నిర్మాణ నిర్మిస్తున్న క్రమంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, టీఆర్ఎస్ ప్రభుత్వం కొలువుదీరింది. కారణం ఏదైనప్పటికీ.. పట్టించుకునే వారు లేకపోవడంతో రోడ్డు పనులు కాస్త మధ్యలో ఆగిపోయాయి.

2009లో షురూ..

మండల కేంద్రంలోని ఈద్గా సమీపం నుంచి మున్నూరుసోమారం గ్రామం వరకు మెటల్ కం బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఫిబ్రవరి 2, 2009లో గనులు, భూగర్భ వనరులు, చేనేత జౌళిశాఖ మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. వివిధ కారణాలతో కాంట్రాక్టర్ రెండేళ్ల తరువాత పనులను ప్రారంభించి, ధారూరు నుంచి అల్లిపూర్ శివారు సుద్ద గనుల వరకు బీటీని నిర్మించారు. అక్కడి నుంచి మున్నూరుసోమారం వరకు చేపట్టాల్సిన పనులు ఫార్మేషన్ రోడ్డుతో ఆగిపోయింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం రోడ్డు నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలింది. దీంతో గుంతలు ఏర్పడి మట్టిరోడ్డుగా మిగిలిందని పరిసర ప్రాంత ప్రజలు చెప్పారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే, ధారూరు నుంచి మున్నూరుసోమారం, వికారాబాద్ వెళ్లడానికి 6 కిలో మీటర్ల దూరభారం తగ్గుతుందని స్థానికులు పేర్కొన్నారు. అయితే రోడ్డు నిర్మాణం పూర్తికి ఎంపీపీ విజయలక్ష్మి యత్నించినా ఫలించలేదని తెలిపారు. కానీ.. ఇప్పటికే ఉన్న ధారూరు–పీలారం వయా అవుసుపల్లి, కుక్కింద, మున్నూరుసోమారం, ధర్మాపూర్ రోడ్డుకు నిధులు కేటాయించినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రస్తుత పాలకులు స్పందించి పాడైన రోడ్డును మరమ్మతు చేయించడంతో పాటు, అసంపూర్తి రహదారిని పూర్తి చేయించి రవాణా కష్టాలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.